# పరిచయం

## విలపించు ప్రసంగి

నేను ఎదిగిన గ్రామములోని సంఘ సువార్తికుడు "విలపించు ప్రసంగి" అని తెలియబడ్డాడు. సహోదరుడుగా, న్యూట్ పెండల్‌టన్ ప్రసంగించేటప్పుడు కన్నీళ్లు కార్చడం అసహజం కాదు. సహోదరులు పెండల్‌టన్ గారి ప్రసంగమంటే మా తల్లికి మహా యిష్టం. ఎందుకంటె అతడు హృదయంతో ప్రసంగించేవాడు. కొందరు దేవుని వాక్యాన్ని నిరాకరించారన్న వాస్తవం తనకు సంతోషం కలిగించేది కాదు. ఇతరుల నిత్య సౌభాగ్యం పట్ల తనకున్న నిజమైన అక్కరతో విధేయతకు అతడు విన్నవించుకొంటూ ఉండేవాడు.

మరియొక విలపించు ప్రసంగి క్రీస్తు పూర్వం ఆరు వందల సంవత్సరాల క్రితం జీవించాడు. అతని తండ్రి పేరు హిల్కీయా. అనాతోతు గ్రామ కాపురస్థుడై, అతడు యాజక కుటుంబానికి సంబంధించినవాడు. అనాతోతు యెరూషలేమునకు ఈశాన్య దిశగా మూడు మైళ్లలోపు ఉంటుంది.[1] ఈ విలపించు (ప్రసంగి) ప్రవక్త పేరు యిర్మీయా, "దేవుడు పారవేసిన దానిని స్థాపించును" లేక "దేవుడు పారవేయును" అని అర్థం. దేవుడు తనను పిలిచిన పనులలో ఒకదానికి అతని పేరు సూచనగా ఉన్నట్టుంది: "... నశింప జేయుటకును పడద్రోయుటకును" (యిర్మీయా 1:10సి).

యూదా, యెరూషలేములో తన స్వరాన్ని వినిపించే ఒకడు, ఒక ప్రవక్త దేవునికి అవసరమయ్యాడు. అది తరచుగా జరిగినట్టే, ఆ పనికి దేవుడు తల్లి గర్భములోనుండియే ఆ పని కొరకు ఏర్పరచుకొన్నట్టున్నాడు. ఈ విలపించు ప్రవక్తను పిలిచిన తీరును యిర్మీయా గ్రంథము మనకు తెలుపుతుంది:

> బెన్యామీనుదేశమందలి అనాతోతులో కాపురమున్న యాజకులలో ఒకడై, హిల్కీయా కుమారుడైన యిర్మీయా వాక్యములు – ఆమోను కుమారుడైన యోషీయా యూదాకు రాజైయుండగా అతని యేలుబడి పదుమూడవ సంవత్సరమున యెహోవా వాక్కు యిర్మీయాకు ప్రత్యక్షమాయెను. మరియు యోషీయా కుమారుడగు యెహోయాకీము యూదాకు రాజై యుండగాను, యోషీయా కుమారుడగు సిద్కియా యూదాకు రాజై యుండగాను, అతని యేలుబడి పదనొకండవ సంవత్సరాంతము వరకును, అనగా ఆ సంవత్సరమున అయిదవ నెలలో యెరూషలేము చెరదీసికొనిపోబడు వరకును ఆ వాక్కు ప్రత్యక్షమగుచుండెను.
>
> యెహోవావాక్కు నాకు ప్రత్యక్షమై యీలాగు సెలవిచ్చెను–గర్భములో నేను నిన్ను రూపింపక మునుపే నిన్నెరిగితిని, నీవు గర్భమునుండి బయలుపడక మునుపే నేను నిన్ను ప్రతిష్ఠించితిని, జనములకు ప్రవక్తగా నిన్ను నియమించితిని (1:1–5).

యిర్మీయా జన్మింపక మునుపే, "జనములకు ప్రవక్తగా" దేవుడు అతనిని నియమించాడు. తాను చేయ కోరుకున్న దానిని జరిగించడానికి దేవుడు ఎన్నిమార్లు ఒక బాలుని

లేపియుంటాడు! యిర్మీయా యింకను యువకుడుగానే ఉన్నాడు, సాధారణంగా తన (13–19 సంవత్సరాలలోపు) వయస్సులో ఉంటాడు.

తొలిగా, ప్రవక్త అభ్యంతరాన్ని వ్యక్తపరచాడు: "అయ్యో ప్రభువగు యెహోవా, చిత్తగించుము నేను బాలుడనే; మాటలాడుటకు నాకు శక్తి చాలదు" అని యిర్మీయా అంటాడు (1:6). దేవుడు అతని సాకును అంగీకరించక, "– ఇదిగో నేను నీ నోట నా మాటలు ఉంచియున్నాను" అని అన్నాడు (1:9బి). మరో సందర్భంలో, దేవుడు అతని బలవంతము చేసినట్టు ఫిర్యాదు చేశాడు. అతడు మానుకోగోరాడు. అయితే ఆయన వాక్యము అతనిలో మండుచున్నట్టును, మానుకోలేక ఉన్నట్టును తెలిపాడు (యిర్మీయా 20:7–9). చెప్పడానికి అతనిది ఒక విషాధ గాధ.

యిర్మీయా ఎందుకు విలపించాడు? యిర్మీయా పరిచర్యను ఆవరించియున్న చరిత్రను మనం పరిశీలించినట్టయితే, అందుకు మనం మూడు కారణాలను చూడగలుగుతాం.

## అతని సందేశం త్రోసివేయబడింది

ప్రజాదరణలేని సందేశాన్ని ప్రకటించడానికి యిర్మీయా పిలువబడ్డాడు. ఆలకించని జనులకు ప్రకటించడం నిరుత్సాహంగా ఉంటుంది. జనాభిమానము లేకుండ ఒకడు నెమ్మదిగాను సంతుష్టిగాను బ్రదుకవచ్చు, కాని నీవు దేవుని పని చేస్తున్నందున నిన్ను ద్వేషించే సమాజపు జనుల మధ్య నివసించడం కష్టం. రాబోవు నాశనము దృష్ట్యా, తనకు భార్యగాని, పిల్లలుగాని ఉండకూడదని దేవుడు యిర్మీయాకు ఆదేశించాడు (యిర్మీయా 16:1–4). దేవుడు తనకు అప్పగించినపని (పాజిటీవ్ మాటల్లో గాక, నెగటీవ్ మాటల్లో) అనుకూలపు మాటలలో గాక, వ్యతిరేకపు మాటల్లో యిలా వర్ణింపబడింది: "పెల్లగించుటకును, విరుగగొట్టుటకును, నశింపజేయుటకును పడద్రోయుటకును, కట్టుటకును నాటుటకును ..." (యిర్మీయా 1:10).

యూదాకు దేవుని స్వరముగా ఉండునట్లు విలపించు ఈ ప్రవక్త పిలువబడినప్పుడు, యోషీయా కొద్దిమంది మంచి యూదా రాజులలో ఒకడు – పదమూడు సంవత్సరాలుగా యెరూషలేములో సింహాసనాసీనుడుగా ఉన్నాడు. ఆ సమయానికి రాజు కేవలం ఇరవై యొక్క ఏండ్ల ప్రాయముగలవాడు (2 రాజులు 22:1). యిర్మీయా పిలువబడిన అయిదు సంవత్సరాలకు, యెరూషలేములో విస్తృతంగా మతపరమైన సంస్కరణలు ప్రారంభ మయ్యాయి. దేవాలయాన్ని బాగుచేసి, ఆరాధనను పునరుద్ధరించడానికి ఆరంభించాడు (2 రాజులు 22:3–23:25). యెహోవా వాక్యానికి యోషీయా తన హృదయాన్ని తెరిచినవాడై ఉన్నాడు. తానును, యిర్మీయాయు ఆలాటి భావాలే కలిగినవారు కావచ్చు, వారు దేవుని ప్రేమించుదానిలో పాల్గొన్నారు, ఒకరితోనొకరికి మంచి సంబంధాలు గలవారైనట్టు కన్పిస్తారు. దేవాలయమును శుభ్రం చేస్తున్నప్పుడు పనివారికి నిబంధన గ్రంథం దొరకగా, యూదయయందతటను యెరూషలేములోను యిర్మీయా ఆ గ్రంథపు మాటలను ప్రకటించుతూ ఉండేవాడు (2 రాజులు 22:8–11; యిర్మీయా 11:1–8). యోషీయా హృదయము దేవునివైపు తిరుగుటలో, నిస్సందేహంగా, యిర్మీయా గొప్ప ప్రభావాన్ని కనుపరచాడు. యోషీయా చనిపోయినప్పుడు, యిర్మీయా యోషీయా మరణం

విషయమై విలపించి, అతని మరణంవలన యూదాలో దేవుని పనికి జరిగిన నష్టాన్ని గూర్చి విలాపమును వ్రాశాడని విదితమైయుంది (2 దినవృ. 35:25).

యోషీయా మరణానంతరం, యిర్మీయా సందేశాన్ని యూదా రాజులలో ఎవడును ఆహ్వానించినట్టులేదు. ప్రత్యేకించి సిద్కియా, దేవుడు "నియమించిన ప్రవక్తయైన యిర్మీయా మాట వినకయు, తన్ను తాను తగ్గించుకొనకయు ఉండెను" (2 దినవృ. 36:12బి). దేవుడు తనకు యిచ్చిన రూపంలోనే ప్రవక్త సత్యాన్ని ప్రకటించుతున్నప్పటికిని, ఎవరును అతని నమ్మలేదు.

యోషీయా చేసిన సంస్కరణలు బహు అల్పంగాను, బహు ఆలస్యంగాను జరిగాయి. తన హృదయము సున్నితంగా ఉండి, అతడు తన దేవుని సన్నిధిని తన్నుతాను తగ్గించుకున్న కారణంచేత, అతని దినాలలో రాజ్యాన్ని కాపాడుతానని దేవుడు అతనికి వాగ్దానం చేశాడు (2 రాజులు 22:18–20). ఏదియెలాగున్నా, యూదావారి పాపం ఆర్పజాలనంత తీవ్రంగా దేవుని కోపాన్ని రేపింది. యోషీయా వెంట వచ్చిన రాజులందరికి (2 రాజులు 23:26, 27) (యెహోయహాజు, యెహోయాకీము, యెహోయాకీను, సిద్కియా). అతడు సత్యాన్ని ప్రకటించినా, గర్విష్టులైన ఆ రాజులు దేవుని వాక్యాన్ని ఆలకించే మనస్సు లేనివారై యున్నారు (యిర్మీయా 17:19–27). యూదా దేశమును, దాని ప్రభుత్వమును, తన సొంత సమాజపు జనులును యిర్మీయాను శత్రువుగా చూడసాగారు (యిర్మీయా 12:6).

యెరూషలేము దేవాలయపు ఆవరణములో ప్రకటించడానికి దేవుడు యిర్మీయాను పంపినట్లు యిర్మీయా 26వ అధ్యాయంలో మనం చదువుతాం. యూదా అంతటినుండి జనులు అక్కడ ఆరాధించడానికి వస్తారు. వారు తన సందేశాన్ని వినవలెనని దేవుడు కోరుతున్నాడు. యిర్మీయా ప్రకటనను అక్కడనున్న యాజకులును, ప్రవక్తలును విన్నప్పుడు, వారు మండిపడ్డారు. అతన్ని చంపాలని పట్టుకున్నారు. మరణాన్ని ఎదురుగా చూస్తుండి కూడ, దేవుని సందేశాన్ని ఆలకించుడని యిర్మీయా వారిని బతిమాలుకున్నాడు. అతని ఆకాంక్ష అంతా వారి క్షేమంకొరకే – తనకొరకు కాదు. అతడు యిలా అన్నాడు,

> ఇదిగో నేను మీ వశములోనున్నాను, మీ దృష్టికేది మంచిదో యేది యుక్తమైనదో అదే నాకు చేయుడి. అయితే మీకు చెవులార ఈ మాటలన్నిటిని చెప్పుటకు నిజముగా యెహోవా మీయొద్దకు నన్ను పంపియున్నాడు గనుక, మీరు నన్ను చంపినయెడల మీరు మీమీదికిని ఈ పట్టణముమీదికిని దాని నివాసుల మీదికిని నిరపరాధి రక్త దోషము తెప్పించుదురని నిస్సందేహముగా తెలిసికొనుడి (యిర్మీయా 26:14, 15).

యెహోవా నామమున అతడు పలికినందుకు అతని చంపకుడని ప్రజలను ఒప్పించడానికి యూదా అధిపతులే ముందుకు వచ్చారు. హిజ్కియా కాలంలో సంభవించిన ఒక సంఘటనను వారికి తెలియజెప్పారు. అప్పుడు మోరష్తీయుడైన మీకాను వారు జ్ఞాపకం చేశారు. హిజ్కియా అతని చంపలేదు సరిగదా, అతడు ఆ ప్రవక్త మాటను అనుసరించాడు (యిర్మీయా 26:16–19).

మరణంనుండి రక్షింపబడినా, యిర్మీయా యింకను శత్రువుగనే జనులచేత భావింప బడుతున్నాడు. సిద్కియా ఏలుబడి కాలంలో నాల్గవ సంవత్సరమందు, యూదా

బబులోనుచే ఓడింపబడుతుందనే దానికి గుర్తుగా, యిర్మీయా కాడి తన మెడమీద వేసికొన్నవాడుగా కన్పిస్తాడు. యూదా చుట్టునున్న దేశములకు అతడు సందేశం పంపుతూ బబులోను రాజుయొక్క అధికారాన్ని వారు కూడ అంగీకరించవలసిందని లేకుంటే వారు నశింపజేయబడతారని తెలిపాడు. హనన్యా అనే ఒక అబద్ధ ప్రవక్త యిర్మీయా మెడమీద నున్న కాడిని విరిచి, యూదా మీదనున్న బబులోను ఆధిపత్యం రెండు సంవత్సరాలలోగా విరువబడుతుందని ప్రకటించాడు (యిర్మీయా 27:1–28:11).

ఏదియెలాగున్నా, యిర్మీయా దైవ సందేశాన్ని ప్రకటించుటలో కొనసాగాడు. హనన్యా విరిచిన కొయ్యకాడికి బదులు, ఇనుపకాడి పెట్టబడుతుందనియు, దేవునికి విరోధంగా జనులు తిరుగుబాటు చేయునట్లు హనన్యా ప్రేరేపించినందున అతడు ఒక సంవత్సరంలోనే చస్తాడనియు యిర్మీయా తెలిపాడు. యిర్మీయా ప్రవచనం నెరవేరింది (యిర్మీయా 28:12–17), అయితే యిర్మీయా యూదాకు వ్యతిరేకంగాను, బబులోను పక్షంగాను ఉన్నట్టు రాజు భావించాడు. ప్రవక్త మీద రాజద్రోహచర్య ఆరోపించబడింది. దానితో అతడు స్వతంత్రంగా జనము మధ్య తిరిగే అవకాశాన్ని కోల్పోయాడు (యిర్మీయా 36:5).

యిర్మీయా జీవితపు తరువాత భాగంలో, అవి చదువబడునట్లు తన ప్రవచన వాక్యములను దాఖలు చేయుమని దేవుడు యిర్మీయాకు ఆజ్ఞ యిచ్చాడు. నమ్మదగిన విద్యార్థిగాను, లేఖకుడుగాను బారూకు యిర్మీయా ప్రవచనాలను దాఖలు చేసి, యెహోవా మందిరములో వాటిని చదివి వినిపించాడు (యిర్మీయా 36:1–10). దేవుని మందిరములో ఆ మాటలు చదివిన తరువాత, వాటిని బహిరంగముగా చదువుమని చెప్పారు. బారూకుచే లిఖింపబడిన యిర్మీయా మాటలను రాజుకు తెలుపక మునుపు వారు వెళ్లి దాగియుండుడని బారూకునకును, యిర్మీయాకును ఆనతి అయ్యింది (యిర్మీయా 36:11–19).

యిర్మీయా సందేశము రాజగు యెహోయాకీముకు చదివి వినిపింపగా, అతడు ఆ సమయమున చలికాచుకొనుచున్న తన కుంపటిలో ఉన్నాడు. మూడు, నాలుగు పుటలను చదివిన తరువాత రాజు చాకుతో దాని కోసి ఆ కుంపటిలోనున్న అగ్నిలో వేయగా అది బొత్తిగా కాలిపోయింది (యిర్మీయా 36:20–23). అటు తరువాత బారూకు, యిర్మీయాలు బంధింపబడాలని రాజు ఆజ్ఞాపించగా కనబడకపోయిరి. ఇంతలో, యింకా కొన్ని చేర్పులతో, ఆ గ్రంథాన్ని తిరిగి రాయుమని దేవుడు యిర్మీయాకు సెలవిచ్చెను (యిర్మీయా 36:27–32).

కొద్ది కాలంలోనే యెహోయాకీమును గూర్చిన యిర్మీయా మాటలు నెరవేర్చబడ్డాయి. బబులోనురాజైన నెబుకద్నెజరు యెరూషలేమునకు వచ్చి అతనిని సామంత రాజుగా చేసికొన్నాడు. మూడు సంవత్సరాల తరువాత, యెహోయాకీము నెబుకద్నెజరుపై తిరుగుబాటు చేశాడు. బబులోను సైన్యము యెరూషలేము మీదికి దండెత్తి, యెహోయాకీమును బంధీగా చేసింది. చిన్నవాడైయున్న అతని కుమారుడు, తన తండ్రికి మారుగ రాజై మూడునెలల పది దినాలు ఏలాడు. నెబుకద్నెజరు అతనిని కూడ బంధీగా పట్టుకొనిపోయి, సిద్కియాను యెరూషలేములో రాజుగా నియమించాడు (2 దినవృ. 36:8–10).

సిద్కియా సింహాసనమెక్కినప్పుడు యిరువది యొక సంవత్సరములవాడై,

యెహోయాకీము యిర్మీయాకు విరోధియైనట్టు యితడు విరోధి కాకపోయాడు. ఏది యెలాగున్నా, ప్రధానులు, యాజకులు, అబద్ధ ప్రవక్తలు – మునుపటివలెనే విరోధులుగా ఉన్నారు. నెబుకద్నెజరుకు విరోధంగా ఐగుప్తు తమకు సహాయము చేయవచ్చునను నిరీక్షణతో, వారు బబులోనుకు విరోధంగా మంతనాలు జరుపుతునే వచ్చారు. ఐగుప్తుతో పొత్తుపెట్టుకొనవద్దు, దేవుడు శిక్షిస్తాడని యిర్మీయా తెలుపగా, యిర్మీయా తమ శత్రు పక్షమువాడని జనులు తలంచారు.

ఒక దినాన యిర్మీయా తన స్వగ్రామానికి, తన ఆస్తిని పొందడానికి వెళ్లుతున్నాడు. యూదుల సైన్యములోని అధికారి ఒకడు అది చూచి, యిర్మీయా కల్దీయులతో చేరడానికి వెళ్లుతున్నట్టు అతనిమీద నేరం మోపాడు. ఆ అధికారి యిర్మీయాను బంధించి, తిరిగి యెరూషలేమునకు తీసికొనిపోయి, చెరసాల గోతిలో వేయించాడు. యిర్మీయా అక్కడ అనేక దినాలున్నాడు (యిర్మీయా 37:11–16).

సిద్కియాకు యిర్మీయాపై అంత యిష్టం లేకపోయినప్పటికి, యెహోవా యొద్దనుండి తనకేమైనా సందేశం ఉందా అని తెలిసికొనడానికి అతడు అక్కర కనుపరచుతూ ఉండేవాడు. అతడు యిర్మీయాను చెరసాలలోనుండి తీసి బందీగృహశాలలో ఉంచాడు (యిర్మీయా 37:17–21). యూదుల తిరుగుబాటును అంతమొందిచుటకు చివరిగా బబులోనీయులు రాగా, జనులు బబులోను రాజునకు లోబరచుకొని, తాము పొందేది ఏదో అది దేవుని వద్దనుండి చేయబడు శిక్షగా అంగీకరించాలని యిర్మీయా ఉద్ఘాటించాడు లేక నిర్బంధపరచాడు. తన వర్తమానము జనులను నిరాశపరచేదని, జనులకు హానికరమయ్యింది గనుక కొందరు యిర్మీయాను చంపగోరారు. బురద మాత్రమే ఉన్న గోతిలోనికి యిర్మీయాను దింపారు. త్రాళ్లతో అతని అందులో దింపగా, అతని కాళ్లు బురదలోనికి కూరుకొనిపోయాయి (యిర్మీయా 38:1–6).

కూషీయుడగు ఎబెద్మెలెకను షండుడు అతని మీద జాలిపడి, అతడు అక్కడ చావకుండునట్లు గోతిలోనుండి యిర్మీయాను లేవనెత్తుమని రాజును వేడుకొంటాడు. అతడు గోతిలోనుండి ఎత్తబడి, పట్టణం పట్టబడేవరకు కావలిలో ఉంచబడ్డాడు – లేక బందీగృహశాలలో ఉంచబడ్డాడు (యిర్మీయా 38:7–13).

## యెరూషలేము నాశనము

దేవుని ప్రజలు వారి పట్టణము పడిపోవడం చూడ యిర్మీయాకు యిష్టము లేకయుంది. యిర్మీయాను గూర్చి ప్రజలలో వ్యతిరేక భావాలున్నా, అతడు యూదా ప్రజలను యెరూషలేము పట్టణాన్ని ప్రేమించాడు. యెరూషలేము నాశనాన్ని ప్రకటించడం వలన అతనికి ఆనందమేమీ కలుగలేదు. తన నలభై సంవత్సరాల ప్రవచన కాల మంతటిలో, అతడు విలపించి అనేక కన్నీళ్లు కార్చాడు. దేవుని మాటను జనులు ఆలకించ నందున విపత్తు వస్తుందన్న విషయం అతనికి తెలుసు.

యెరూషలేము నాశనం చేయబడిన సంగతి 2 రాజులు 25, 2 దినవృ. 36, యిర్మీయా 39లో దాఖలు చేయబడింది. బబులోను రాజైన నెబుకద్నెజరు తన సైన్యాన్ని పట్టణం చుట్టు ముట్టడి వేయించాడు. పట్టణంలో ఎవరైనా ప్రవేశించడానికిగాని, ఎవరైనా

అందులోనుండి వెలుపలికి వెళ్లడానికి గాని వీలులేకుండ పోయింది. పట్టణంలో ఆహారం లేకపోయేసరికి, తప్పించుకుని పోవాలనే ప్రయత్నంలో యూదా సైన్యము, సిద్కియా రాజు గోడకు కన్నం వేశారు. యెరికో మైదానానికి అతడు చేరునంతలో నెబుకద్నెజరు సైన్యము అతనిని తరిమి సిద్కియాను పట్టుకుంది, సిద్కియా సైన్యం చెల్లాచెదురయ్యింది. సిద్కియాయు, అతని కుమారులును, తక్కిన బంధీలను రిబ్లా పట్టణంలో ఉన్న నెబుకద్నెజరు ఎదుటికి తేబడ్డారు. అక్కడ వారికి తీర్పు తీర్చబడింది. తన కుమారులు చంపబడుచుండగా సిద్కియా గతిలేనివాడై వారి చావును తన కన్నులార చూడవలసి వచ్చింది. అటు పిమ్మట అతని రెండు కండ్లు పెరికివేయబడ్డాయి. ఇత్తడి సంకెళ్లతో బంధింపబడినవాడై అతడు బబులోనుకు కొనిపోబడ్డాడు.

తరువాత, నెబుకద్నెజరు యొక్క సైన్యాధిపతి యెరూషలేమునకు తిరిగి వెళ్లి, అక్కడ ఉన్న ప్రతిదానిని నాశనం చేశాడు. దేవాలయములోని విలువైనవాటిని పట్టుకొని వాటిని బబులోనుకు తరలించాడు. ముక్కలు ముక్కలుగా విడదీయబడిన కట్టడాలను అతడు తరలించి, పనికిరాని కుప్పలను వదలి వెళ్లాడు. కాల్చివేయబడే దానంతటిని అగ్నికి ఆహుతి చేశాడు – యెరూషలేము దేవాలయాన్ని, రాజు నగరును అధికారుల యిళ్లు కూడ అందులో చేర్చబడ్డాయి. గోడలను పడద్రోసి, ప్రజలను బంధీలుగా పట్టుకొని, బానిసలనుగా వారిని బబులోనుకు కొనిపోయాడు. కేవలం కొద్దిమంది పేదలు మాత్రమే ఆ దేశంలో విడువబడ్డారు.

ఇశ్రాయేలుకు గర్వకారణంగా ఒకప్పుడు ఆభరణమైయుండిన యూదా, ఎవరి అభిమానాన్ని అది పొందగోరిందో, ఎవరి దేవతలను అది గౌరవించిందో ఆ జనుల చేతనే అది బంధీగా పట్టబడింది. విస్తరించిన వర్తకానికిని, మతానికిని యూదా దేశపు కేంద్రమైయుండిన యెరూషలేము, యిప్పుడు బూడిద కుప్పలుగా మారిపోయింది. ఎన్నడూ జరుగదని ప్రజలు ఏమి తలంచారో, అది జరిగిపోయింది.

యెరూషలేము పట్టబడిన తరువాత, చెరసాలలోనుండి యిర్మీయాను విడిపించి బబులోనీయులు అతనిని సగౌరవంగా చూచారు (యిర్మీయా 39:11-14). తమ ప్రభుత్వానికి అనుకూలంగా అతడు మాట్లాడినట్టు వారికి తెలిసిపోయింది. తాను బబులోను వెళ్లగోరతాడో స్వదేశంలోనే నివసిస్తాడో కోరుకునే అవకాశం అతనికి యివ్వబడింది (యిర్మీయా 40:4, 5). తన స్వదేశంలోనే అతడు నివసింపగోరాడు.

## యూదా యొక్క దురవస్థపై అతని ఆలోచనలు

నాశనం తరువాత, తాను చూచిన దానిని గూర్చియు, తన మనోభావాలను గూర్చియు వ్రాయుమని దేవుడు యిర్మీయాకు సెలవిచ్చాడు. విలాపవాక్యములన్నిటిలో ప్రత్యక్ష సాక్షి ఆ సంగతులు వ్రాసినట్టు మనకు రుజువు కన్పిస్తుంది. నాశనం జరిగిపోయిన కొద్ది గంటలకే వినాశనకరమైన ఆ శిథిలాలలో యిర్మీయా తిరిగియుండవచ్చు. కన్నీటితో నిండిన కన్నులతో చనిపోయిన శవాలను, లయమైపోయిన పట్టణపు రాళ్ల కుప్పలను అతడు చూచియుండవచ్చు. తన జీవిత దినాలు ఏ పట్టణంలో గడిచిపోయాయో, అదే పట్టణం రాళ్ల కుప్పలుగా మిగిలిపోయింది.

నమ్మశక్యముగాని పరిస్థితిని వేదనకరమైన మూలుగులతో నిరాశ, నిస్సహాయ భావాలు వ్యక్తపరచబడ్డాయి. ఏ దేవతలను యూదా ఆరాధించిందో ఆ దేవతలకు దేవుడు దానిని అప్పగించగా యూదా దురవస్థను అనుభవిస్తుంది. అవసరతలో దేవుళ్లు కానివి సహాయం చేయనేరవనే వేదనకరమైన పాఠాన్ని యూదా నేర్చుకోవలసి వచ్చింది.

ఏమి జరుగనైయుందో దానిని గూర్చి తాను హెచ్చరించినను జనులు తన సందేశాన్ని లక్ష్యపెట్టలేదన్న వాస్తవం యిర్మీయా యొక్క దుఃఖాన్ని అధికం చేసింది. అది వారికి జరుగకుండాలని అతడు కోరుకున్నాడు. ఐగుప్తును, యితర దేశములును తమకు తోడ్పడతాయనే నమ్మికతో, వారు దేవుని మాటను ఆలకించనందుననే అంతటి ఘోరమైన నాశనం జరిగింది. అది అలా జరగడానికి కారణం, దేవుడైన యెహోవాయే సత్య దేవుడని వారు నమ్మ నిరాకరించారు. విలాపవాక్యములు విలపించు గ్రంథం. క్రీస్తు ఈ లోకానికి అవతరించడానికి 585 సంవత్సరాల ముందు యూదాకును, యెరూషలేమునకును జరిగిన విపత్తుకు యిది స్మశాన గీతమైయుంది. ఈ క్రింది యిర్మీయా మాటలను గమనించు:

> నా జనులలో హతమైనవారిని గూర్చి నేను దివారాత్రము కన్నీరు విడుచునట్లు నా తల జలమయముగాను నా కన్ను కన్నీళ్ల ఊటగాను ఉండును గాక, నా జనులందరు వ్యభిచారులును ద్రోహుల సమూహమునై యున్నారు. ఆహహా, అరణ్యములో బాటసారుల బస నాకు దొరికిన ఎంతమేలు? నేను నా జనులను విడిచి వారియొద్దనుండి తొలిగి పోవుదును (యిర్మీయా 9:1, 2).

---

## సందేశమేమి?

*యిర్మీయావంటి మనోభావం నీకు ఎప్పుడైనా కలిగిందా?* నీవు దేవుని మాటను ఆలకింప కృషి చేసి, ఆయన కొరకు జీవించుతూ, ఆయన సందేశాన్ని ప్రకటించియు, కేవలం ఓటమిని, నిరాశను నీవు జీవితంలో ఎదుర్కొని యుండవచ్చు. నీవు చాలని వాడవుగను, అసమర్థుడవుగను భావించవచ్చు. ఇతరులు నిన్ను అపహసించి, మత పిచ్చగాడివని, నిర్విచార సమస్యకు అధిక నటన కనుపరచుతున్నావని నిన్ను ప్రజలు గేలిచేయవచ్చు. అపహసింపబడినవాడవై, నీ ఆలోచనలతో ఒంటరిగా నీవు విడిచిపెట్టబడ గోరవచ్చు.

మరణ భయాన్ని ఎదుర్కోవలసివచ్చినా, నమ్మకత్వాన్ని వీడని యిర్మీయాను జ్ఞాపకం చేసికో. సమస్తము దేవుని స్వాధీనంలోనే ఉంది, యిర్మీయా దినాల్లో ఆయన ఉద్దేశాలు ఎలాటివో నేడును అవి అట్టివే. ప్రత్యేకమైన ఉద్దేశం కొరకు దేవుడు మనలను చేశాడు. తన స్వరూపమందు ఆయన మనలను చేసి, మన అంతరంగంలో ఆయనకు నివాస స్థలం కావాలని కోరుతున్నాడు. తన కొరకు నిర్మించుకున్న మన హృదయాలలో ఆయన నివాసం ఏర్పరచుకొన కోరుకున్నాడు. మన దేహాలు ఆయనకు ఆలయంగా ఉండాలని ఆయన కోరుకున్నాడు (1 కొరింథీ. 6:19, 20; ఎఫెసీ. 2:21, 22).

సుఖ జీవనం కొరకు దేవుడు మనలను పిలువలేదు. ఆయన మనలను సిలువకు, అవమానానికి అపహాస్యానికి పిలుస్తున్నాడు. ఆయన మన జీవితములయందు హెచ్చింప

బడునట్లు మనలను మనము ఉపేక్షించుకొనుటకు ఆయన పిలుస్తున్నాడు. లోకముతో కలిసిపోయి గుర్తింపబడనివారముగా పోవాలని క్రీస్తు సిలువపై తన శిష్యుల కొరకు మరణించ లేదు. నీతి మార్గము ఎల్లప్పుడును "బహు తక్కువగా పయనించిన మార్గమే." ఆయనను సేవించుటకొరకైన క్రయధనము అనేకసార్లు మనము భరించగల దానికంటె ఎక్కువగా ఉంటుంది. ఏదియెలాగున్నా, అంతములో, ఆయనను సేవించక పోవడమనేది అంతకంటె మరి యెక్కువైన ఋణమును చెల్లించుకోవలసినదై ఉంటుంది. దేవుని మార్గాన్ని కోరుకుని యిర్మీయా చెల్లించిన దానికంటె, తిరుగుబాటును, విగ్రహారాధనను కోరుకున్న యూదా బహు ఎక్కువ వెలను చెల్లింపవలసి వచ్చింది.

*వింటూ, అయినా దేవుడు చెప్పిన దానిని ఆలకింపని* – యూదావలె నీవు ఎక్కువగా ఉన్నావేమో. దేవుని సన్నిధికంటె అధికంగా నీవు పాప భోగమును కోరుకుంటున్నావా? ఆత్మ సంబంధమైన దుశ్చేష్టను ప్రేమించి, అపాయకరమైన పరిణామాలను ఎదుర్కోవలసిన పరిస్థితిలో నీవు నిలిచియుండవచ్చు. నీకు సత్యము ప్రకటింపబడియుండవచ్చును గాని దానిని విశ్వసించునట్లు నీవు పట్టించుకొనక పోవచ్చు. మనం ఏమి వినగోరుతున్నామో అది ప్రకటింపబడినప్పుడు దానిని వినడం సత్యాన్ని ఎదుర్కొనడం కంటె సులభమే.

మన భౌతిక, సాంఘీక, ఆర్థిక సమస్యలకు పరిష్కారం విద్య, విజ్ఞాన పరిశోధన, సాంకేతిక పురోభివృద్ధియని నేడు జనులు తలంచుతుంటారు. వారు ఎంత జ్ఞానం కలిగినవారైనా, విద్యావంతులైనా, దేవుడు లేని జనులు శ్రేష్ఠులు కారనేది సత్యం. విద్య, పరిశోధన, సాంకేతిక పరిజ్ఞానము సహాయం చేయవచ్చు గాని, దేవుడు లేకుండ భూమిమీద జీవిత సహజ గుణాన్ని పెంపొందించలేం. పదార్థ సంబంధమైన సొత్తులను పూజించడం. స్వనాశనం తెచ్చుకొనడమే. వారు దేన్ని ఆరాధిస్తుంటారో, జనులు ఆ రూపంగా మారుతూ ఉంటారు. సొత్తును ఆరాధించువాని ఆత్మ క్రుంగిపోయినదై, దేవుని వాస్తవంతో సంబంధాన్ని కోల్పోతుంది.

తాము జ్ఞానులమని చెప్పుకొంటూ బుద్ధిహీనులైనవారిని గూర్చి పౌలు తన పత్రికలలో మాట్లాడాడు (రోమా 1; 1 కొరింథీ. 2). వారు దేవుని మహిమను మనుష్యుల యొక్కయు జంతువుల యొక్కయు ప్రతిమా స్వరూపాలుగా మార్చారు. వారు దేవుని సందేశాన్ని తమకు అనుకూలమైనట్టు మార్చారు. "దేవుడు వారిని అప్పగించెను" అనే పదాలను రోమా 1లో పౌలు మూడుసార్లు ఉపయోగించాడు (24, 26, 28 వచనాలు). ఒక జీవిత విధానానికి లేక ఆయనకు బదులు వారు ఏర్పరచుకొన్న దేవతలకు దేవుడు వారిని అప్పగించినప్పుడు, వారు ఎంతగా నశించిపోతారంటే, వారు నశించిన స్థితిని సయితం వారు ఎరుగలేని స్థితికి దిగజారుతారు.

దేవుని వాక్యం వినవలసిన అత్యవసరమైన సమయం ఏదైనా ఉంటే, అది యిప్పుడే. దేవుని మాట వినడానికి ఎంతో సమయముందని గాని, లేదా తరువాత ఆయన మాట ఆలకించడం అనుకూలంగా ఉంటుందనిగాని తలంచడం సులభం. జనులు తేలికగా మోసపరచబడతారు. మనం ఏది వినగోరతామో దానిని విని, మిగిలినది ఏదైనా దాన్ని త్రోసిపుచ్చుతాం.

1965లో చిలీ తీరానికి వందల మైళ్ల దూరంలో భూకంపం ఒకటి పెద్ద ఉప్పెనవంటి

అలను రేపింది. తీరాన్ని తాకడానికి ఆ అలకు కొన్ని గంటలు పట్టింది. క్షేమకరమైన స్థలాలకు తరలిపోండని తీరవాసులకు అధికారులు హెచ్చరికలిచ్చారు. ఆ అల వచ్చినప్పుడు 32 మంది చనిపోయినట్టును, 27 మంది కన్పించక పోయినట్టును రిపోర్టు వచ్చింది. యునైటెడ్ ప్రెస్ అంతర్జాతీయ కరెస్పాండెంట్ అయిన జార్జి ఈగల్ యిలా రిపోర్టు యిచ్చాడు, "దీనిలో ఎవరే చావవలసిన అవసరత లేదు, వారు చాలా సమయానికి ముందే హెచ్చరికలు పొందారు, హెచ్చరికను వారు కేవలం పట్టించుకోలేదు."

సత్యాన్ని మనం అలక్ష్యం చేయకుందుము లేదా తరువాత విందాములే అని ఊహించ వద్దు. అయితే, పౌలు యొక్క హెచ్చరికను విందాం:

> ... ఇదిగో ఇప్పుడే మిక్కిలి అనుకూలమైన సమయము, ఇదిగో ఇదే రక్షణ దినము (2 కొరింథీ. 6:2).

సూచన

[1]C. Von Orelli, "Jeremiah," *The International Standard Bible Encyclopedia*, vol. 3, ed. James Orr (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1957), 1588.

## విలాపవాక్యముల విషయం మరియు శైలి రూపం

జ్ఞాపకం చేసికొనడానికి విలాపవాక్యముల గ్రంథం రాయబడింది. మరువజాలని దాని శైలి, సమాచారము అనేవాటి గుణలక్షణాలను ఆలోచన చేద్దాం.

*ఎక్రోస్టిక్ అరేంజ్‌మెంట్.* విలాపవాక్యాలలో అయిదు పద్యాలున్నాయి. వాటిలో నాలుగు ఎక్రోస్టిక్ రూపంలో ఉంటాయి; అంటే, ప్రతి వచనము వేరైన ఒక హెబ్రీ అక్షరంతో ఆరంభమై అక్షరమాల యొక్క క్రమములో ముందుకు సాగుతుంది. 1, 2, 4 అధ్యాయాలలో ప్రతిదీ 22 వచనాలు కలిగియుంటుంది. హెబ్రీ అక్షరమాలలో ప్రతి వచనానికి ఒక్కొక్క అక్షరం ఉంటుంది. 3వ అధ్యాయంలో ప్రతి అక్షరానికి మూడు వచనాలుంటాయి – గనుక దానికి 66 వచనాలుంటాయి. 5వ అధ్యాయానికి 22 వచనాలే ఉంటాయి, కాని అక్షరమాల యొక్క క్రమంలో కాదు.[1] ఎక్రోస్టిక్ శైలి విధానం కంఠస్థం చేయడానికి ఉద్దేశింపబడి, తరుచుగా వినియోగించబడుతుంది. అక్షరమాల యొక్క క్రమాన్ని వెంబడించడంవలన జనులు ప్రతి లైన్ను గుర్తుంచుకోడానికి సహాయపడుతుంది.

*సాధారణం కాని పేరు.* ఈ పుస్తకానికి అసలు హెబ్రీ పేరు *ekah*, అంటే "ఎలా!" అని అర్థం అది మొదటి పదంనుండి తీయబడింది 1:1, (2:1, 4:1లో) అదే ఉంది. గ్రంథ సమాచారంనుండి యూదుల పారంపర్యం ఈ గ్రంథపు నామకరణాన్ని తీసికొన్నది. *Qinot* అని అది సూచించింది. దానికి అర్థం "విలాపవాక్యములు."[2]

*సర్వాత్రికమైన అన్వయము.* నేటి బైబిలు విద్యార్థులకు, అంతగా తెలియని గ్రంథమై ఉండవచ్చు. ఎందుకంటే, దాని సందేశం సంబంధం లేనిదిగా వారికి గోచరిస్తుంది.

ఏదియెలాగున్నా, హెబ్రీ సమాజము దీన్ని కంఠస్థం చేసేది! అబు నెల తొమ్మిదవ దినాన దీన్ని బిగ్గరగానైనా చదువుతారు, లేదా నేటి యూదులు యింకా దాన్ని కంఠత పెడతారు. దైవప్రేరేపితము కాని పారంపర్యం ప్రకారం, క్రీ. పూ. 586లో యెరూషలేము దేవాయలం నాశనం చేయబడిన రోజది. అంతే కాదు హేరోదు కట్టించిన దేవాలయపు నాశనం కూడ ఆ దినానే జరిగిందట – క్రీ. శ. 70లో.[3]

దేవుని వైపు తన వీపును మాటిమాటికి తిప్పిన దేశానికి ఏమి సంభవించిందో దాన్ని గూర్చి లభ్యమయ్యే శ్రేష్ఠమైన వర్ణనను విలాపవాక్యములు యిస్తుంది. యుగము లన్నిటిలో ఈ గ్రంథం చదువబడుతూ, జ్ఞాపకం చేసికొనడానికి దేవుడు దీన్ని ఉద్దేశించాడు. దేవుని పట్ల అక్కర లేమిని అజాగ్రత్తను తమ జీవితాల్లో కనుపరచేవారికి యిది మేల్కొలుపు పిలుపునిస్తుంది.

సూచనలు

[1]Anthony Lee Ash, *Jeremiah and Lamentations*, The Living Word Commentary, ed. John T. Willis (Abilene, Tex.: ACU Press, 1987), 331-32. [2]Kenneth Barker, ed., “Introduction,” *The NIV Study Bible*, 10th ed. (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1995), 1579. [3]Ibid.